క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నాగాయితిప్ప(మోపిదేవి): గ్రామీణ ప్రాంతాల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు అన్నారు. నాగాయితిప్ప 7వ వార్డులో గరికిపాటి నాగయ్య ఇంటి నుంచి తాడేపల్లి సుబ్రహ్మణ్యం ఇంటి వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాలకేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు

చల్లపల్లి: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) అన్నారు. శుక్రవారం స్థానిక పడమరవైపు గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, వార్డు సభ్యులు బళ్ల లలితకుమారి, బలే మధుర మీనాక్షి, వైఎస్సార్ సీపీ నాయకులు వెనిగళ్ల తారక జగదీష్ పాల్గొన్నారు.

శిడిబండ్లతో ఊరేగింపు

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద పైడమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం నాలుగో రోజుకు చేరాయి. భక్తులు పెద్దఎత్తున శిడిబండ్లను కట్టి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు. దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ కాకినాడ ఎం. విజయరాజు, మచిలీపట్నం తనిఖీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వీరికి ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు దాసు వాయునందనరావు, ఆసాది శ్యామ్, కమిటీ సభ్యులు తోట సాంబశివరావు, సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

128 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. 128 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గుడివాడ గురురాజు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు ఆర్. లక్ష్మి, జూనియర్ వైద్యులు ఎం. సౌమ్య, ఎం. వందన వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు జె. వాసుదేవరావు, కె. ఆంజనేయులు, ఎ. రమణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల సముదాయం పరిశీలన

మచిలీపట్నంటౌన్: నగరంలోని గో సంఘం వద్ద నిర్మాణం పూర్తి చేసుకున్న టిడ్కో గృహాల సముదాయాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం పరిశీలించారు. గృహాల నిర్మాణం, వాటర్ ట్యాంక్, విద్యుత్ సబ్‌స్టేషన్, సంపులు తదితర పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని జేఈ గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఔషధాలపై అవగాహన కలిగి ఉండాలి

డీఎంహెచ్ఓ గీతాబాయి

కోనేరుసెంటర్: బి ఫార్మసీ విద్యార్థులు ఔషధాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల బి ఫార్మసీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఔషధాల వాడకం వల్ల కలిగే ఉపయోగాలు, నష్టాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో అందరూ ఇళ్లల్లుంటే డాక్టర్లు, నర్సులు, ఫార్మసిస్టులు ధైర్యంగా ముందుకు వచ్చి విధులు నిర్వర్తించారన్నారు. రిజిస్ట్రార్ పి. వీరబ్రహ్మచారి, ఫార్మసీ డీన్ ఆచార్య మారుతి, పి. రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కోనేరుసెంటర్: విద్యార్థులు సమయపాలన పాటించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి జి. జ్ఞానమణి అన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు తరగతులకు ఆలస్యంగా వస్తుండటాన్ని గమనించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. జీవితంలో ఎదగాలంటే సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. సకాలంలో తరగతులకు హాజరు కావాలని చెప్పారు.

వెంకన్నకు పుష్పయాగం



మచిలీపట్నం టౌన్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బచ్చుపేట వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారికి 700 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష్మీ సహస్రనామ, విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ పారాయణ జరిగింది. దాదాపు 500 మంది మహిళా భక్తులు పారాయణలో పాల్గొన్నారు. మధ్యాహ్నం స్వామివారు నవనీత అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం పుష్పయాగం నిర్వహించారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

చెప్పారంటే.. చేస్తారంతే

- 2024 జనవరి నుంచి రూ. 3వేలకు పెరగనున్న పింఛన్
- పెడన నియోజకవర్గంలో 32,515 మంది లబ్ధిదారులు
- ప్రతి నెలా వీరికి రూ.8.90 కోట్ల చెల్లింపు
- జనవరి నుంచి రూ.9.79 కోట్లకు చేరనున్న చెల్లింపులు



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా చెప్పారంటే ఎన్ని అవాంతరాలు ఎదురైనా తప్పకుండా అమలు చేసి తీరతారు. ఇచ్చిన హామీలలో 99 శాతానికి పైగా అమలు చేసి తాజాగా 2024 జనవరి నుంచి పింఛన్లను రూ. 3 వేలకు పెంచనున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలలో ఒకటైన వైఎస్సార్ భరోసా పింఛను ఇప్పటికి మూడు దఫాలుగా పెంచుతూ వచ్చారు. నాలుగో దఫా 2024 జనవరి ఒకటి నుంచి అమలు చేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రతి మండల కార్యాలయం నుంచి నివేదికలను ఇప్పటికే కోరిన ఉన్నతాధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 32,515 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.8.90 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే ఉదయం కోడి కూయక ముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును నేరుగా అందజేస్తున్నారు. ఈ విధంగా గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు. ప్రస్తుతం రూ. 2,750 ఉన్న పింఛను జనవరి నుంచి రూ.3 వేలు కానుంది. దీంతో పెడన నియోజకవర్గంలో ప్రతి నెలా రూ.9.79 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.

నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా..

పెడన పట్టణంలో 4,584 మంది పింఛను దారులుంటే వీరికి రూ.1,27,60,250 చెల్లిస్తున్నారు. జనవరి నుంచి రూ.1,37,52,000లకు చేరనున్నది. అదీ కాకుండా కొత్తగా పింఛనుదారులు కూడా పెరగనున్నారు. దీంతో చెల్లింపుల నగదు ఇంకా పెరగనుంది. పెడన రూరల్‌లో 5,709 మంది పింఛన్ పొందుతున్న వారుంటే వీరికి రూ.1,55,17,500 చెల్లింపులు జరుగుతున్నాయి. జనవరి నుంచి రూ.1,71,27,000లకు చేరనుంది. కృత్తివెన్నులో 7,106 మంది ఉంటే వీరికి రూ.1,93,35,000 చెల్లిస్తున్నారు. ఇక నుంచి రూ.2,13,18,000లను చెల్లించనున్నారు. గూడూరులో 8,326 మందికి రూ.2,29,02,500 ఇస్తున్నారు. ఈ సంఖ్య రూ.2,49,78,000లకు చేరుకోనుంది. ఇక బంటుమిల్లి మండలంలో 6,790 మంది పింఛనుదారులుంటే వీరికి ప్రతి నెలా రూ.1,85,12,500 చెల్లిస్తున్నారు. ఇక నుంచి రూ.2,03,70,000లను చెల్లించనున్నారు.

చాలా సంతోషంగా ఉంది



నాకు మూడు నెలలు కిందటే కొత్తగా వింతంతు పింఛను మంజూరైంది. చాలా సంతోషంగా ఉంది. రూ.2,750లు నుంచి రూ.3వేలు అంటే మాటలు కాదు. అదీ కూడా ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు. గతంలో చాలా మంది పింఛను తీసుకునేందుకు కేంద్రాల వద్ద పడిగాపులు పడే వారు. ఏ రోజు ఎక్కడ ఇస్తారో చెప్పి అక్కడికి రమ్మని చెప్పేవారు. వృద్ధులు వెళ్లి తెచ్చుకోలేని పరిస్థితి ఉండేది. ఆ పరిస్థితి లేకుండా జగనన్న ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు.

– ఎస్. వెంకటేశ్వరమ్మ, 16వ వార్డు, పెడన

నాకూ, మా నాన్నకు పెన్షన్ వస్తోంది



నాకు కొత్తగా మూడు నెలల కిందట పింఛన్ మంజూరైంది. మా నాన్న దివ్యాంగుడి పింఛను పొందుతున్నాడు. నేను కూడా దివ్యాంగుడినే. జగన్ మామయ్య పుణ్యమా అని నేను పెడన జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్నా. మా కుటుంబానికి జగన్ మామయ్య ఎంతో మేలు చేశారు. సీఎం జగన్‌ను ఎప్పటికి మరచిపోము.

– ఎం ముఖేష్, కొంకేపూడి, పెడన మండలం

ఉత్కంఠగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



మోపిదేవిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



ఏటిమొగలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



బందరులో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు



పెదతుమ్మిడిలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

మోపిదేవి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఈనెల 26 నుంచి ఐదు రకాల గ్రామీణ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కబడ్డీ, వాలీబాల్ పోటీలు పూర్తికాగా, మరో మూడు క్రీడలు షటిల్, ఖోఖో, క్రికెట్ పోటీలు నిర్వహించాల్సి ఉందని వ్యాయామ ఉపాధ్యాయులు కె. సత్యనారాయణ తెలిపారు. యువతీ, యువకులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారని, పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయని వివరించారు.

- **గూడూరు:** ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో భాగంగా గూడూరు మండలంలో శుక్రవారం షటిల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. సచివాలయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని 17 సచివాలయాల్లో 82 జట్లు తలపడ్డాయి. శనివారం కూడా షటిల్ పోటీలు కొనసాగుతాయని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. కాగా జనవరి 2 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.
- **మచిలీపట్నంటౌన్:** ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నంలో షటిల్ బాట్మింటన్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. నగరంలోని 17 నుంచి 34వ డివిజన్లలో నమోదు చేసుకున్న క్రీడాకారులు షటిల్ బాట్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. 64 టీమ్‌లకు మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ పోటీల్లో 128 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను షటిల్ బ్యాట్మింటన్ పర్యవేక్షకుడు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, గోపిశెట్టి సతీష్, మీర్ అస్గర్ అలీ, పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

జోరుగా హుషారుగా..

నాగాయలంక: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండలంలోని నాగాయలంక, తలగడదీవి, ఏటిమొగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్‌లో కొనసాగాయి. శుక్రవారం బ్యాడ్మింటన్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాగాయలంక హైస్కూల్ గ్రౌండ్స్‌లో పోటీలు ప్రారంభించిన ఎంపీడీఓ క్రీడాకారులను పరిచయం చేసుకుని పలు సూచనలు చేశారు. మండలంలో నాలుగు జోన్లలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు 104 మంది నమోదు కాగా 52 జట్లుగా పోటీల్లో పాల్గొంటున్నారని, వీటిలో 26 మహిళా జట్లు ఉన్నాయని, నిర్దేశిత షెడ్యూల్ మేరకు ఆటల పోటీలు జరుగుతాయని ఆయన వివరించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విమలకుమారి, ఎంఈఓ ఎ.రామారావు, పీఆర్ ఏఈఈ వాసుదేవరావు, ఈఓపీఆర్‌డీ కె.అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

- **బంటుమిల్లి:** ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా శుక్రవారం ఖోఖో పోటీలు నిర్వహించారు. మండల స్థాయి టీమును పీడీలు ఎంపిక చేశారు. ఎంఈఓలు త్రిపురసుందరీదేవి, వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సచివాలయ అధికారులు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేద్దాం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం డివిజన్ పరిధిలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేద్దామని మచిలీపట్నం డివిజనల్ విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. రుస్తుంబాద బాలికల మునిసిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టెన్త్‌లో డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలతో జిల్లాను అగ్రభాగాన నిలబెడదామని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో రెమీడియల్ క్లాస్‌లు నిర్వహించాలని, ఎస్ఏ–1 ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తిచేసి సైకిల్ టెస్ట్ నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. రామకృష్ణ, డివిజన్‌లోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

న్యాయమూర్తి రామకృష్ణయ్య



చిలకలపూడి(మచిలీపట్నం): బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించేందుకు శుక్రవారం బస్టాండ్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాలల హక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలతో పనులు చేయించరాదని చెప్పారు. బాల కార్మికులు ఎక్కడైనా కనపడితే పోలీస్, స్త్రీ, శిశు సంక్షేమ, న్యాయసేవాధికార సంస్థలకు సమాచారం అందిస్తే వారిని పాఠశాలలో చేర్పిస్తారని చెప్పారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్ది రాజు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి గ్లోరి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

నాగాయలంక: ప్రభుత్వ పథకాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మత్స్యశాఖ జేడీ ఎం. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పర్యాటక శాఖ ఫుడ్‌కోర్టు భవనంలో శుక్రవారం మండల స్థాయి మత్స్యకారుల అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన మత్స్యకారులు తాము ఎంచుకున్న పథకం వివరాలతో కూడిన దరఖాస్తులను గ్రామ స్థాయి మత్స్యశాఖ ఉద్యోగులకు అందజేయాలని సూచించారు. ఎస్ఎఫ్‌డీ అధికారి పి. చలపతిరావు, భారతీయ మత్స్య పరిశోధన సంస్థ అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు కృష్ణా వర్సిటీ విద్యార్థిని ఎంపిక



కోనేరుసెంటర్: ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు 16వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్, కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థిని టి. లక్ష్మి ఎంపికైంది. సికింద్రాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఏడు శిక్షణ శిబిరాలలో పది వేల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొనగా టి. లక్ష్మి ప్రతిభ కనబరచి గణతంత్ర వేడుకలకు ఎంపికై ంది. లక్ష్మిని ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి, రిజిస్ట్రార్ డాక్టర్ పీవీ బ్రహ్మచారి, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. విజయకుమారి, 16వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ కల్నల్ సంసార్‌సింగ్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో విస్తృత ప్రయోజనాలు

తలగడదీవి(నాగాయలంక): ప్రకృతి వ్యవసాయంతో విస్తృత ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి అన్నలూరి సంజీవరావు అన్నారు. మండల పరిధిలోని తలగడదీవి, చోడవరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర గ్రామ సభలు శుక్రవారం ఈఓపీఆర్‌డీ కె.అప్పల నరసమ్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రోన్లతో ఎరువులు, విత్తనాలు పిచికారీ చేసే విధానాలపై డెమో ప్రదర్శించారు. యాత్ర కో–ఆర్డినేటర్ తుంగల గిరి ఆధ్వర్యంలో క్యాలెండర్లు, బ్రోచర్లు ఆవిష్కరించి సంకల్పయాత్రపై ప్రమాణం చేయించారు.

శ్రీవారికి చందనాభిషేకం

చల్లపల్లి: ధనుర్మాసం సందర్భంగా వెంకటేశ్వరస్వామికి చందనాలంకారం చేశారు. శుక్రవారం స్థానిక గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచారి ప్రత్యేక పూజలు, చందనాభిషేకం నిర్వహించారు. గోదాదేవికి పూజలు చేశారు. తిరుప్పావై పాశుర విన్నపాలు సమర్పించారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

పెడన: బ్యూటీషియన్ కోర్సు శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పెడన స్కిల్ హబ్ కో– ఆర్డినేటర్ వంగ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమో చదివిన వారు కూడా అర్హులేనన్నారు. 16 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారు అర్హులని చెప్పారు. బ్యూటీషియన్ కోర్సుతో పాటు ఎమ్మెస్ ఆఫీస్, టైపింగ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో కూడా శిక్షణ ఇస్తామన్నారు. పెడన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 94404 44033 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ

నాగాయలంక: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి శుక్రవారం నాగాయలంక చేరుకున్న శ్రీరాముని అక్షింతలను మండలంలోని గ్రామాలకు పంపించారు. స్థానిక తిప్పపాలెం రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమం అనంతరం మండలంలోని అన్ని గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేశారు. సంస్థ జిల్లా ఇన్‌చార్జి రాజశేఖర్, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగం బసవ శంకరరావు, మెండు సాయిరామ్, ఆకురాతి బాబూరావు, భజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

2 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గూడూరు: అందరి ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గూడూరు వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంపై కంకటావ గ్రామ సచివాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండో విడత కార్యక్రమంలో గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సుబ్బారావు, మాజీ సర్పంచి దుర్గారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బ్రోచర్ అందజేసి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఎదురుమొండి(నాగాయలంక): ఎదురుమొండి దీవుల్లో ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎదురుమొండి, బ్రహ్మయ్యగారి మూల, జింకపాలెం, గొల్లమంద గ్రామాలలో శుక్రవారం ఉదయం, సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి 920 గృహాలకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి బ్రోచర్లను అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం హామీలను అమలు చేశారని చెప్పారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

నియోజకవర్గంలో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం..

నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు నిర్దేశిత కాలంలో పూర్తి చేశామని, జిల్లాలో అవనిగడ్డ నియోజకవర్గం తొలిగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసిందని చెప్పారు. 77 సచివాలయాల పరిధిలో 315 రోజులు పర్యటించి 93,417 గృహాలలో ప్రజలను స్వయంగా కలుసుకోవడం గొప్ప అనుభూతిని మిగిల్చిందన్నారు. తనతో పాటు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచి కన్నా సుధాకీర్తన, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, దివి ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, ఎంపీటీసీలు మోకా నాగప్రసాద్, కొల్లు యానాదిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కన్నా రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

పేర్ని కిట్టు



మొక్కలు నాటిన పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో ప్లంబర్‌గా పనిచేస్తున్న తల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి తల్లిదండ్రులు వెంకట నర్సిరెడ్డి, వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్ స్ట్రక్చర్లు 5, ఓపీ కౌంటర్లకు నాలుగు రిసెప్షన్ చైర్లు, 40 మొక్కలను వితరణగా అందజేశారు. డయాలసిస్ యూనిట్ ముందు ఉన్న సర్కిల్‌లో ఈ మొక్కలను పేర్ని కిట్టు నాటి స్ట్రక్చర్లు, కుర్చీలను ఆస్పత్రి అధికారులకు అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి ఆస్పత్రి అభివృద్ధికి అందించిన సహకారాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డి. ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఆర్ఎంఓ నిరంజన్‌కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ. 90 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్: జిల్లాలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు పెద్ద సంఖ్యలో రికవరీ చేశారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అప్పగించనున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ పి. జాషువా శుక్రవారం పోలీసు కార్యాలయంలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ప్రదర్శించి మాట్లాడారు. 2023 జనవరి నుంచి వివిధ రకాలుగా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న అనేకమంది ఫిర్యాదు చేశారని చెప్పారు. మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం (ఎంఎంటీఎస్)ను వినియోగించి సుమారు రూ. 90 లక్షల విలువ గల 421 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని చెప్పారు. ఇదే సిస్టంతో గతంలో 50 లక్షల విలువ చేసే 252 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సెల్: 94906 17573 వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని లేదా హెల్ప్ అని మెసేజ్ పంపి అడిగిన సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, బందరు డీఎస్పీ మాధవరెడ్డి, సీసీఎస్ డీఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

నాగాయితిప్ప(మోపిదేవి): ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై ప్రజలలో ఉన్న అపోహలు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై పూర్తి అవగాహన కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు అన్నారు. నాగాయితిప్ప, కోసూరువారిపాలెంలో శుక్రవారం ఈవీఎం, వీవీ ప్యాట్స్ వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లకు ఈవీఎం, వీవీ ప్యాట్స్ వినియోగంపై ఉన్న అపోహలను అవగాహన కార్యక్రమాల ద్వారా తొలగిస్తున్నామని చెప్పారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఈవీఎంలపై అవగాహన కల్పించామని చెప్పారు. మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, లింగం జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఆర్వో రాజ్యలక్ష్మి

పెడన: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఓటర్లు అధిక సంఖ్యలో హాజరయ్యే పోలింగ్ స్టేషన్లలో మూడు అంత కంటే ఎక్కువ ఉన్న బూత్‌ల వద్ద సౌకర్యాలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలోని గదిలో వెలుతురు సక్రమంగా ఉండాలని, లేకుంటే విద్యుత్ సౌకర్యం, లైట్ల ఏర్పాటుకు అవకాశం ఉన్నదీ, లేనిదీ పరిశీలిస్తున్నామని చెప్పారు. ఒక పోలింగ్ స్టేషన్‌లో మూడు, అంతకంటే ఎక్కువగా ఉన్న పోలింగ్ బూత్‌లపై ఉన్నతాధికారులు నివేదిక కోరారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మూడు, అంతకంటే ఎక్కువగా బూత్‌లున్నవి 23 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పురపాలక టీపీఓ ఏసుబాబు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ముస్లిం మత గురువుకు సత్కారం

గూడూరు: పవిత్ర మక్కా యాత్రకు వెళ్తున్న మత గురువు హఫీజ్ మహ్మద్ షోయబ్‌ను గూడూరు జామియా మసీదులో ముస్లింలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. గూడూరు జామియా మసీదులో మత గురువైన మహ్మద్ షోయబ్ ఈనెల 31న ఉమ్రా యాత్రకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ మహ్మద్ అబ్దుల్ రహీం (ఖాజా), వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ సాహెబ్ (దాదా), కార్యదర్శి అబ్దుల్ సలీం, కోశాధికారి మహ్మద్ బషీర్, ఇమామ్ జమాల్ బేగ్, అబ్దుల్ సమద్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.